

రిటైర్డ్ జీఎంకు సన్మానం

గోదావరిఖని: సింగరేణి రెస్క్యూ జీఎంగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన వెంకటేశ్వర్లును సోమవారం ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో జీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



వైద్యులు కనిపించే దేవుళ్లు

కోల్‌సిటీ: కనిపించే దేవుళ్లు వైద్యులని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సిమ్స్‌లో సోమవారం నిర్వహించిన డాక్టర్స్ డేకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/27.0

ఆకాశం మేఘావృతమవుతుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పదెకరాల్లోపు ఉంటేనే ‘రైతుభరోసా’



మాట్లాడుతున్న డీఏవో ఆదిరెడ్డి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): పదెకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్నవారికే రైతుభరోసా పథకం వర్తింపజేయాలని మెజారిటీ అన్నదాతలు తెలిపారు. చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రత్యేక సమావేశం సోమవారం చైర్మన్ దేవరనేని మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. డీఏవో రైతుభరోసాపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. అనంతరం డీఏవో మాట్లాడుతూ రైతుభరోసాపై రైతుల అభిప్రాయం సేకరించామని, ఆయా సంఘాల తీర్మానాల నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్, సీఈవో రమేశ్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో డాక్టర్స్ డే



వేడుకల్లో ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్

కోల్‌సిటీ(రామగుండం): వైద్యుల దినోత్సవం సందర్భంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో సోమవారం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. సింగరేణి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, ఆర్ఎంవోలు, హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు. అలాగే రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి ఆధ్వర్యంలో డాక్టర్లను సత్కరించారు.

వైద్యుడు, ఫార్మసిస్ట్‌కు మెమోలు

ముత్తారం(మంథని): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ అమరేందర్‌రావుతోపాటు ఫార్మసిస్ట్‌కు మెమో జారీచేయనున్నట్లు డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ సోమవారం తెలిపారు. ఖమ్మంపల్లి, మచ్చుపేట పల్లెదవాఖానలో సేవలు అందించాల్సిన ఎంఎల్‌హెచ్‌పీలు బియ్యని లావణ్య, బొల్లం దీప్తిని అనుమతి లేకుండా ముత్తారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తించాలని ఆదేశించిన అమరేందర్‌రావుపై ఈ చర్య తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పల్లెదవాఖానలో రెండునెలలుగా లావణ్య, దీప్తి సేవలు అందించడం లేదని, దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని పలువురు పేషెంట్లు తమ దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. అదేవిధంగా ఆస్పత్రిలో అందుబాటులో లేని ఫార్మసిస్ట్ జగదీశ్‌కు కూడా మెమో జారీచేస్తామని డీఎంహెచ్‌వో వివరించారు. కాగా, సిబ్బంది కొరతతోనే ఎంఎల్‌హెచ్‌పీలు ముత్తారంలో విధులు నిర్వహించాల్సి వస్తోందని వైద్యుడు అమరేందర్‌రావు వివరించారు.

త్వరలో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

గోదావరిఖని: నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ ఇచ్చేందుకు త్వరలోనే స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభిస్తామని ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్ సోమవారం తెలిపారు. సింగరేణి సీఎండీ ఆదేశాల మేరకు స్థానిక తిలక్‌నగర్ డౌన్‌లోని సింగరేణి స్కూల్ పాత భవనం ఆధునీకీకరించి స్కిల్‌డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో 38 కోర్సుల ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఇప్పటివరకు 1,693 మంది ఉద్యోగులు మెడికల్ ఇన్‌వాలిడేషన్‌కాగా 1,491 మందికి కారుణ్య ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందించామని పేర్కొన్నారు. 131 మందికి రూ.25 లక్షల చొప్పున అందించామని తెలిపారు. 14 మందికి ఎంఎంసీ ద్వారా నెలకు రూ.26 వేల చొప్పున చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్ త్వరలో అందుబాటులోకి వస్తుందని అన్నారు. జూన్‌లో 3.58లక్షల టన్నులకు 3.70లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఆయన వివరించారు.

ఆధునిక సాంకేతికతతో విద్యుత్ బిల్లులు



ఆధునిక పరికరాలు

జ్యోతినగర్(రామగుండం): టీజీ ఎన్పీడీసీఎల్ విద్యుత్ బిల్లులను ఆధునిక సాంకేతిక పద్ధతి ద్వారా జారీచేస్తోంది. గతంలో స్పాట్ బిల్లింగ్ మిషన్ ద్వారా బిల్లులు జారీచేసేవారు. దీంతో తరచూ ఆలస్యమయ్యేది. ప్రస్తుతం ఐఆర్‌డీఏ పరికరం, పోర్టబుల్ ప్రింటర్లను సిబ్బందికి అందజేశారు. వీటిని మొబైల్ ఫోన్‌కు అనుసంధానం చేసి కరెంట్ మీటర్‌ను స్కాన్ చేస్తే డాటా మొత్తం మొబైల్‌లోని యాప్‌లోకి చేరుతుంది. ఆ తర్వాత ప్రింటర్ ద్వారా బిల్లు ప్రింట్ తీసి వినియోగదారులకు ఇస్తారు. బిల్లు వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ అవుతుంది. ఈ ప్రక్రియ కేవలం 20 క్షణాల్లో పూర్తవుతుంది.



వినతిపత్రం అందిస్తున్న నాయకులు రామ్మూర్తి, ఐలి శ్రీనివాస్

ప్రైవేటీకరణకు వ్యతిరేకం

గోదావరిఖని: దేశంలో కేంద్రప్రభుత్వం చేపట్టిన బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా టీబీజీకేఎస్ నాయకులు సోమవారం గనులపై నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదాసి రామ్మూర్తి, వడ్డేపల్లి శంకర్, ఎల్.వెంకటేశ్, పోలాడి శ్రీనివాసరావు, ప్రవీణ్, ఐ.సత్యనారాయణ, రాజేశం, దూట శేషగిరి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్మూర్తి, ఐలీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్జీ–2 ఏరియాలోని మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు.



మాట్లాడుతున్న రియాజ్‌అహ్మద్, ఐ.కృష్ణ, నరేశ్, కుమారస్వామి

ఐక్య ఉద్యమాలు అవసరం

గోదావరిఖని: సింగరేణి సంస్థను బతికించుకోవడానికి అన్ని కార్మిక సంఘాలు ఐక్య ఉద్యమాలు చేయాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్‌అహ్మద్ కోరారు. నగరంలోని యూనియన్ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సకలజనుల సమ్మె తరహాలో ఉద్యమించేందుకు అందరూ సిద్ధం కావాలని ఆయన కోరారు. జేఏసీ నాయకులు జక్కుల నారాయణ, ఖయ్యూం, కృష్ణ, నరేశ్, కుమారస్వామి, నీరటి రాజన్న, రాజేందర్, శేఖర్, రాములు, పోశమల్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీతారామయ్య, పక్కన వైవీరావు, ఎల్లాగౌడ్

సంస్థ మనుగడ ముఖ్యం

గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల సంస్థ మనుగడ కోసం కార్మిక వర్గం ఉద్యమించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. సోమవారం స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా జూలై 5 నుంచి 12 వరకు సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎల్.ప్రకాశ్, వైవీరావు, మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, కందుకూరి రాజారత్నం తదతరులు పాల్గొన్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా యూరియా ఉత్పత్తి

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్) కర్మాగారం గతజూన్‌లో 1,00,859.76 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేశామని ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం (ఓఅండ్‌ఎం) ఉదయ్ రాజహంస సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలం మొదలు కావడంతో యూరియా వినియోగం అధికమైందన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా యూరియా ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. జూన్‌లో ఉత్పత్తి చేసిన యూరియాలో తెలంగాణకు 36,645.41 మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 5,256.09 మెట్రిక్ టన్నులు, కర్ణాటకకు 21,656.16 మెట్రిక్ టన్నులు, మహారాష్ట్రకు 10,884.96 మెట్రిక్ టన్నులు, ఛత్తీస్‌గఢ్‌కు 10,443.42 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 2,629.53 మెట్రిక్ టన్నులు, మధ్యప్రదేశ్‌కు 13,544.19 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని ఆయన వివరించారు.

మళ్లీ ముంచుతారా?

- ప్రతిపాదనలకే పరిమితమైన కరకట్టల నిర్మాణం
- గతంలో వరదలతో నీటమునిగిన గోదావరిఖని, మంథని
- మరోసారి ముంపు తప్పదని ప్రజల ఆందోళన



సాక్షి, పెద్దపల్లి: ప్రకృతి ప్రకోపం కన్నా మానవ తప్పిదాలే గోదావరి తీరప్రాంత వాసులకు గండంగా మారాయి. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ జిల్లావాసులకు ముఖ్యంగా గోదావరిఖని నగర, మంథని పట్టణవాసులకు ముప్పుగా పరిణమిస్తోంది. రెండేళ్ల క్రితం కురిసిన భారీవర్షాలతో వరదలు వచ్చి గోదావరిఖని, మంథనిలో పలు కాలనీలు నీటమునిగాయి. ప్రజలు ఆర్థికంగా నష్టపోయారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల లీకేజీలతో నీటిని నిల్వచేసే అవకాశం లేకుండాపోయిందని తెలుస్తోంది. అయితే సుందిళ్ల బ్యారేజీ నుంచే గోదావరి వరద నీటిని ఎత్తిపోసే అవకాశాలు ఉన్నాయి. దీంతో బ్యాక్ వాటర్ ముప్పు సమస్య మళ్లీ పునరావృతం అయ్యే అవకాశాలు ఉన్నాయని, గత తప్పిదాల నుంచి పాలకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు గుణపాఠం నేర్చి వరద ముప్పు నుంచి రక్షించే చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

> గతంలో భారీవర్షాలతో వచ్చిన వరద బొక్కలవాగులోకి వచ్చి.. అక్కడి నుంచి గోదావరి నదిలో చేరింది. గోదావరిలో ప్రవాహం ఉధృతంగా ఉండడంతో వాగు వరదతో పోటెత్తింది. బ్యాక్‌వాటర్ నాలాల ద్వారా మంథని పట్టణాన్ని ముంచెత్తింది. ఫలితంగా బొక్కలవాగు, మర్రివాడ, వాగుగడ్డ, బోయినిపేట, లైన్‌గడ్డ, దొంతులవాడ, భగత్‌నగర్, చాకలివాడ, మంగళివాడ, దుబ్బగూడెం, ఎస్సీకాలనీ, అంబేద్కర్‌నగర తదితర ప్రాంతాలు నీటమునిగాయి. ఈసారి అన్నారం బ్యారేజీలో నీళ్లు ఆపే పరిస్థితి లేదు. వరద ప్రమాదం పెద్దగా ఉండదని భావించిన అధికార యంత్రాంగం.. ముందస్తు జాగ్రత్తలేవీ తీసుకోలేదు. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

‘ఎల్లంపల్లి’ కీలకం

- కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీ, సరస్వతీ బ్యారేజీల్లో కుంగిన పిల్లర్ల పునరుద్ధరణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి.
- ఈ నేపథ్యంలో నీటి నిల్వలు లేకుండా వాటి గేట్లలన్నీ ఎత్తివేశారు.
- పునరుద్ధరణ పనులు ముమ్మరంగా చేస్తున్నారు.
- ఎగువనుంచి ఇన్‌ఫ్లో వస్తే.. పార్వతీ బ్యారేజీ గేట్లు మూసి అందులో 8 టీఎంసీలు నిల్వచేసుకుని అత్యవసరాలకు పార్వతీ పంపుహౌస్ నుంచి ఎత్తిపోతలతో ఎల్లంపల్లిని నింపుకునే అవకాశం ఉంది.
- అయితే కరకట్టలు నిర్మించకపోవడంతో గోదావరి నదీ పరీవాహక ప్రాంతాలకు వరద ముప్పు ఉంటుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.
- ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలంటున్నారు.

అడ్డుకట్ట లేక..

గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీ, శ్రీరామసాగర్, కడెం ప్రాజెక్టుల నుంచి వచ్చే వరదతోపాటు, శ్రీపాదఎల్లంపల్లి క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసే భారీవర్షాలతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు గతేడాది రికార్డుస్థాయిలో వరద వచ్చి చేరింది. వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదలడంతో సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు వరద పోటెత్తింది. ఈ బ్యాక్‌వాటర్‌తో గోదావరి నదీపరీవాహక ప్రాంతంలోని గోదావరిఖని నగరం, మంథని పట్టణం నీటమునిగాయి. సుందిళ్ల బ్యారేజీతో రామగుండం ప్రాంతానికి ముప్పు ఉందన్న ల్యాడర్ సర్వేలో తేలడంతో గోదావరి నది ఒడ్డున 8 కి.మీ. సుందిళ్ల గ్రామం వరకు కరకట్ట నిర్మించి వదిలేశారు. గోదావరిఖని వరకు మరో 5 కి.మీ. మేర కరకట్ట నిర్మించేందుకు రూ.110 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. ఇవి ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. దీంతో మల్కాపూర్, సప్తగిరికాలనీ, ప్రశాంత్‌నగర్, రెడ్డికాలనీ, రఘుపతిరావ్‌నగర్ వరద ముంపునకు గురయ్యాయి.



ఈఏడాది సైతం భారీ వర్షాలు కురిస్తే బ్యాక్ వాటర్ వచ్చి భారీ నష్టం తప్పదని స్థానికులు భయంతో వణికిపోతున్నారు.

ప్రజా‘వాణి’ వినండి.. సమస్యలు పరిష్కరించండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన అభాగ్యులు సోమవారం భారీ సంఖ్యలో కలెక్టరేట్‌కు తరలివచ్చారు. తమ సమస్యలపై అర్జీల రూపంలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్ ప్రసాద్‌లాల్‌కు అందజేశారు. వీటిని పరిశీలించి, పరిష్కరించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై సంబందిత అధికారులు పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- పెద్దపల్లి శివారు చందపల్లి గ్రామం వద్ద ఎస్సారెస్పీ కాలువకు అనుబంధంగా ఉన్న కాలువను పూడ్చడంతో తమ పంట భూములకు సాగు నీరు అందడం లేదని, కాలువను పునరుద్ధరించాలని రంగు సతీశ్ అనే రైతు కోరాడు.

- ఇద్దరు కుమారులు తన భూమి పట్టా చేసుకున్నారని, ఇప్పుడు బువ్వ పెట్టడం లేదని, ఇంట్లో ఉండ నివ్వడం లేదని, పోషణ గురించి పట్టించుకోవడం లేదని పెద్దపల్లి మండలం అప్పన్నపేటకు చెందిన కమలమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. తన భూమి తన పేరిట పట్టాచేయించి ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకుంది.

అక్రమంగా రోడ్డు వేశారు



మా పట్టాభూమిలో పక్కన భూమికి చెందిన వారు దౌర్జన్యంగా రోడ్డు వేసుకున్నారు. ప్రశ్నించినందుకు మాపై దాడి చేశారు. మా భూమిలో అక్రమంగా వేసిన రోడ్డును తొలగించి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.

– నారాయణరెడ్డి, సుగుణ, గుండ్లపల్లి, ఓదెల

ధాన్యం డబ్బులో కోత పెట్టారు



కష్టపడి పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకున్నామనుకుంటే మాకు చెప్పకుండానే నిర్వాహకులు, మిల్లర్లు కలిసి కోత విధించిండ్రు. బస్తాకు నాలుగు కిలోల వరకు కోత విధించి డబ్బు మా బ్యాంకు ఖాతాలో జమచేసిండ్రు. వేలాది రూపాయల నష్టం జరిగింది. అధికారులు న్యాయం చేయాలె.

– ప్రసాద్, రైతు, భోజన్నపేట, పెద్దపల్లి

‘గృహజ్యోతి’ రాలేదు



గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న. ఇప్పటికీ లబ్ధి చేకూరడం లేదు. పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం చేస్తున్నరు. దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. దీంతోనే సమస్య తలెత్తింది. అధికారులు బిల్లు చెల్లించాలంటున్నరు. కార్యదర్శిపై చర్య తీసుకోండి.

– చిలుక రాజేశ్, వడ్కాపూర్, జూలపల్లి

ఇల్లు ఇప్పించండి



భర్త లేడు. ముగ్గురు పిల్లలను పోషించేందుకు కూలీ పని చేసుకుంటున్న. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపులో తీసిన లాటరీలో ఇల్లు దక్కినా.. కేటాయింపులో అన్యాయం జరిగింది. అన్నివిధాలా అర్హురాలిని. ఇల్లు ఇప్పించి న్యాయం చేయాలి.

– రావుల రమాదేవి, పెద్దపల్లి

పేదలకు రూ.5 లక్షలు

- ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సాయం
- ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి
- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని/ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): అర్హులైన పేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా రూ.5లక్షల సాయం అందిస్తామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హామీ ఇచ్చారు. సోమవారం ఆయన 38వ డివిజన్‌లోని సంజయ్‌గాంధీనగర్, ఇందిరానగర్, 39వ డివిజన్ శాంతినగర్‌లో పర్యటించారు. ప్రజా సమస్యల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, మురుగుదొడ్లు, తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తామని అన్నారు. సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ పరిశ్రమల సీఎస్ఆర్ నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. సంజయ్‌గాంధీనగర్ రైల్వేట్రాక్ సమీపంలో అప్రోచ్ రోడ్డు నిర్మించాలని, పార్క్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మేయర్ బి.అనిల్‌కుమార్, కార్పొరేటర్లు జంగాపల్లి సరోజ, మహంకాళి స్వామి, బొంతల రాజేశ్ ముస్తఫా, కమిషనర్ శ్రీకాంత్, ఈఈ రామన్, తహసీల్దార్ కుమారస్వామి, డిప్యూటీ డీఎం, హెచ్‌వో కృపాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

జ్యోతినగర్(రామగుండం): మూడోడివిజన్‌లోని అంబేద్కర్ భవన్ లైన్‌లో రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించారు. వినతిపత్రం స్వీకరించిన ఎమ్మెల్యే.. కమిషనర్‌కు బదిలీ చేశారు. పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. స్థానికులు రామాచారి, మల్లేశ్, శంకర్, శ్యాంకుమార్, రాజయ్య, నరసయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాసేవ ముఖ్యం



ఎంపీపీ బాలాజీరావు, పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్(పెద్దపల్లి): పదవులు ముఖ్యం కాదని, నిస్వార్థంగా ప్రజాసేవలో ముందుకు వెళ్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య చివరి సమావేశం సోమవారం జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిస్వార్థంగా సేవచేస్తే నాయకులను ప్రజలు గుండెల్లో పెట్టుకొని చూస్తారన్నారు. ఎంపీపీ బాలాజీరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, జెడ్పీటీసీ మినుపాల స్వరూపారాణి, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



పోలీసు కమిషనర్ శ్రీనివాస్

గోదావరిఖని: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతీఒక్కరి బాధ్యత అని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆపరేషన్ ముస్కాన్ పేరిట ఈనెలాఖరు వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ముస్కాన్–10 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 18ఏళ్ల వయసులోపు వారు తప్పిపోయినా, వదిలివేసినా, కిరాణాలు, మెకానిక్ షాపులు, హోటళ్లలో, వివిధ కంపెనీలు, రోడ్డుపై భిక్షాటన చేస్తున్నా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. చిన్నపిల్లలతో బలవంతంగా భిక్షాటన, వెట్టి చాకిరీ చేయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో బాలకార్మికులు పనిచేస్తూ కనిపిస్తే 1098, డయల్ 100, స్థానిక పోలీస్‌లకు సమాచారం అందించాలన్నారు. సబ్ డివిజన్ల వారీగా ఇన్‌చార్జీలను నియమించామన్నారు. పెద్దపల్లి సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఎస్సై 87126 56507, గోదావరిఖని సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఎస్సై 98855 08894కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆయన కోరారు.

సింగరేణిలో 97శాతం బొగ్గు ఉత్పత్తి

- 2024–25 ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం : 72 మిలియన్ టన్నులు
- మొదటి త్రైమాసికం ఉత్పత్తి లక్ష్యం : 17.31 మిలియన్ టన్నులు
- సాధించిన బొగ్గు ఉత్పత్తి : 16.70 మిలియన్ టన్నులు



బొగ్గు వెలికితీస్తున్న షావల్

గోదావరిఖని: సింగరేణి సంస్థ 2024–25 ఆర్థిక సంవత్సరం తొలిమూడునెలల్లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలకు చేరువలో నిలిచింది. సంస్థలోని మొత్తం 11 ఏరియాలు ఉత్పత్తిలో పోటీపడుతున్నాయి. ఇందులో మూడు ఏరియాలు లక్ష్యాల సాధనలో ముందంజలో నిలిచాయి. త్రైమాసికంలో 17.31 మిలియన్ టన్నుల లక్ష్యానికి 16.70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి 97శాతం నమోదు చేశాయి. సింగరేణి సంస్థ మొదటి త్రైమాసికం(మూడునెలలు)లో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి సాధనలో దూసుకుపోతోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతోంది. అయితే, ఆర్థిక సంవత్సరం తొలిత్రైమాసికంలో 173.14లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి 167.09లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి 97శాతంలో నిలిచింది. ఏరియా వారీగా ఉత్పత్తి లక్ష్యాలు పరిశీలిస్తే ఆర్జీ–2 ఏరియా 138శాతం బొగ్గు ఉత్పత్తి సాధించి అగ్రగామిగా నిలిచింది. భూపాలపల్లి ప్రాజెక్టు 71శాతం బొగ్గు ఉత్పత్తితో చివరిస్థానంలో వెనుకబడింది. గత మూడు నెలల్లో ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి అనుకూలంగా ఉంది. వర్షాలు కురుస్తున్నా.. ఏరియాల వారీగా ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ ముందుకు సాగింది. వర్షాకాలంలో ఓసీపీల్లో ఉత్పత్తి తగ్గినా ఈ మూడు నెలల్లో పెరిగిన ఉత్పత్తి కలిసి వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

ముందంజలో మూడు ఏరియాలు

వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో మొదటి నెలలో సంస్థ వ్యాప్తంగా నాలుగు ఏరియాలు ముందంజలో ఉన్నాయి. ఆర్జీ–2 ఏరియా 138శాతం బొగ్గు ఉత్పత్తి సాధించి ముందంజలో ఉండగా, ఇల్లెందు 109శాతంతో రెండోస్థానంలో, 103శాతంలో బెల్లంపల్లి మూడోస్థానం, 97శాతంతో మణుగూరు నాలుగో స్థానంలో నిలిచింది. రాబోయే రోజుల్లో ఉత్పత్తి లక్ష్యాలను సాధించే దిశగా సీఎండీ బలరామ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తిపై ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని సూచించారు.

బొగ్గు ఉత్పత్తి(లక్షల టన్నుల్లో)

ఏరియా	లక్ష్యం	సాధించింది	శాతం
ఆర్జీ–1	12.15	11.36	93
ఆర్జీ–2	17.52	24.17	138
ఆర్జీ–3	16.14	15.27	95
ఏపీఏ	2.77	2.33	84
భూపాలపల్లి	10.35	7.33	71
కొత్తగూడెం	35.13	32.58	98
ఇల్లెందు	9.21	10.05	109
మణుగూరు	33.91	32.76	97
బెల్లంపల్లి	9.70	9.98	103
మందమర్రి	10.19	8.46	86
శ్రీరాంపూర్	16.03	12.75	79

క్లుప్తంగా

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారులోని కూనారం రైల్వేగేటు సమీపంలో సోమవారం తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి, ముత్తారం మండలం ఓడేడ్‌కు చెందిన ఆకుల మొగిళి(49) ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్య కారణాలతోనే బలవన్మరణానికి పాల్పడ్డాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. మృతుడి భార్య సమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

రాజన్న సన్నిధిలో ఒకరు..



విష్ణు మృతదేహం

సిరిసిల్లక్రైం/వేములవాడ అర్బన్: వేములవాడ రాజన్న సన్నిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన గూడూరి విష్ణు(36) సోమవారం ఆర్టీసీ బస్సులో వేములవాడ ఆలయానికి చేరుకున్నాడు. రాజన్న ఆలయ కట్టమీద వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి, అక్కడే మృతిచెందాడు. గమనించిన భక్తులు ఆలయ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. కానీ, బస్ టికెట్ చూసి, సిరిసిల్ల నుంచి వేములవాడ వచ్చినట్లు తెలియడంతో మృతుడి ఫొటోను సిరిసిల్ల సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీంతో అతని పేరు విష్ణు అని, గతంలో సాంచాలు, ఆటో నడిపేవాడని సమాచారం అందింది. అతని తల్లిదండ్రులు చనిపోయారని, వివాహం జరిగినా, కుటుంబసభ్యులతో ఉండటం లేదని పోలీసులు తెలిపారు. మృతుడిపై ఓ హత్య కేసు ఉందని విశ్వసనీయవర్గాల సమాచారం.

రైస్‌మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ దాడులు



మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు

జమ్మికుంట(హుజూరాబాద్): ప్రభుత్వానికి సీఎమ్మార్ అప్పగించకపోవడంతో జమ్మికుంట పట్టణంలోని సప్తగిరి ఇండస్ట్రీస్ మిల్లులో స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీం అధికారి అనిల్‌కుమార్ జగిత్యాల డీఎం హతీరాంతో కలిసి సోమవారం దాడులు నిర్వహించారు. మిల్లుతోపాటు ధాన్యం నిల్లలున్న గోదాములను తనిఖీ చేశారు. 2022-23 యాసంగిలో 73,579 క్వింటాళ్ల ధాన్యం తీసుకోగా 20,281 క్వింటాళ్లు మరాడించారని, 2023-24 వానాకాలంలో 42,570 క్వింటాళ్లు తీసుకొని, 9,531 క్వింటాళ్లు మరాడించినట్లు, 2023-24 యాసంగిలో 38,330 క్వింటాళ్లు తీసుకొని, 2,559 క్వింటాళ్లు మరాడించారని తెలిపారు. మొత్తం ధాన్యంలో 10,756 క్వింటాళ్ల వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించామన్నారు. కొంత ధాన్యం వర్షాల వల్ల చెడిపోయిందని మిల్లు యజమాని శ్రీనివాస్ చెప్పారన్నారు. తేడా వచ్చిన ధాన్యానికి సంబంధించి డబ్బులు చెల్లిస్తానని, మిగతా ధాన్యం సీఎమ్మార్ పెట్టేందుకు సెప్టెంబర్ వరకు గడువు ఉందని, ఆలోగా అప్పగిస్తానన్నారని పేర్కొన్నారు. జమ్మికుంట తహసీల్దార్ విజయ, డీటీసీఎస్ వసంతరావు, ఎఫ్ఐ వినోద్ కుమార్, జమ్మికుంట టౌన్ సీఐ రవి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 'ప్రైవేట్' చదువులందేనా?

- ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు ఉత్తమాటేనా?
- అధ్యయనం పూర్తయి పదేళ్లు గడిచినా ఫలితం లేదు
- విద్యాహక్కు చట్టం అమలైతే ఉమ్మడి జిల్లాలో 50 వేల మంది విద్యార్థులకు లబ్ధి



కరీంనగర్: పేద విద్యార్థులకు ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం సీట్ల కేటాయింపు, ప్రభుత్వమే ఖర్చులు భరించి, ఉచితంగా చదువు చెప్పించాలనే నిర్ణయం మళ్లీ తెరపైకి వచ్చింది. ఇటీవల సుప్రీంకోర్టు రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యాహక్కు చట్టం అమలు చేయకపోవడం, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకపోవడం వంటి విషయాలపై సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో మళ్లీ టీచర్ పోస్టుల భర్తీ, విద్యాహక్కు చట్టం అమలు సాధ్యాసాధ్యాలపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి, సుప్రీంకోర్టు సూచించిన అంశాల అమలుకు బడ్జెట్ కేటాయింపులు తదితరాలపై సంబంధిత అధికారులతో సమీక్షించేందుకు నిర్ణయించినట్లు సమాచారం. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించి, విద్యాహక్కు చట్టం అమలుపై సూచనలు, సలహాలు తీసుకునేందుకు సర్కారు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అయితే, ప్రభుత్వమే కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యనందిస్తుందని ఒకవైపు చెబుతూనే, మరోవైపు ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామంటుండటం విద్యాహక్కు చట్టం అమలుపై గందరగోళానికి కారణమవుతోంది. ఈ విద్యాసంవత్సరమైనా ప్రైవేట్ విద్యాసంస్థల్లో పేద విద్యార్థులు చదివేందుకు అవకాశం లభిస్తుందో లేదో వేచిచూడాలి.

2012లోనే నివేదిక..

విద్యాహక్కు చట్టంలో భాగంగా.. ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలని పదేళ్ల క్రితమే సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. కానీ, ఇంతవరకు అది అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వం 8 మందితో నియమించిన కమిటీ సీట్ల కేటాయింపుపై అధ్యయనం చేసి, 2012 మే నెలలోనే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. దానిపై గత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో వేలాది మంది పేద విద్యార్థులు ప్రైవేట్ చదువులకు దూరమయ్యారు.

ఫీజుల భారంతో మిన్నకున్న సర్కారు

సీట్ల కేటాయింపునకు ప్రైవేట్ యాజమాన్యాలు విముఖంగా ఉన్నాయి. ఒకవేళ పేద పిల్లలకు సీట్లు కేటాయించినా ఒలింపియాడ్, కాన్సెప్ట్, టెక్నో, ఇంటర్నేషనల్, ఈ-టెక్నో స్కూళ్ల పేరిట వసూలు చేస్తున్న వేలాది రూపాయల ఫీజులను ప్రభుత్వం చెల్లించలేని పరిస్థితి. అందుకే గతంలో పలు విద్యాసంస్థల యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయి. కమిటీ అధ్యయనం తర్వాత చాలావరకు యాజమాన్యాలు కొంతమేర అంగీకారం తెలిపాయి. కానీ, కమిటీ ప్రభుత్వంపై ఏటా పడే పడే ఫీజుల భారాన్ని కూడా నివేదికలో పేర్కొంది. ఇది చూసి, సర్కారు మిన్నకుండిపోయింది.

1,300కు పైగా ప్రైవేట్ స్కూళ్లు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1,300కు పైగా ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు 3 లక్షల మంది విద్యార్థులున్నారు. ఆయా విద్యాసంస్థల్లో 25 శాతం సీట్ల ప్రకారం.. 75 వేల మందికి ఉచితంగా ప్రైవేటు చదువులు చెప్పాలి. అయితే, ఒకటో తరగతిలో చేరే విద్యార్థులకే చట్టం వర్తిస్తుందని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. మధ్యలో చేరే వారికి ప్రైవేట్ చదువులు చెప్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని విద్యాశాఖ అధికారులు అంటున్నారు. ఫలితంగా విద్యాశాఖ చట్టం అమలైతే 45 వేల నుంచి 50 వేల మందికి లబ్ధి చేకూరనుంది. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. సర్కారు స్కూళ్లలో చదివే విద్యార్థులు ప్రైవేటు బడులకు తరలితే.. ఎలా? అని ప్రభుత్వం చట్టం అమలుకు వెనకడుగు వేసిందని గతంలో విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.

చట్టాన్ని అమలు చేయాలి



సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయకపోవడం విచారకరం. ప్రైవేటు విద్యాసంస్థలకు కొమ్ము కాసేలా ప్రభుత్వాలు పని చేస్తున్నాయి. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్నట్లు మన దగ్గర కూడా చట్టాన్ని అమలు చేయాలి.

– కె.రాణాప్రతాప్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి

అక్రమ నిర్మాణం కూల్చివేత అడ్డగింత



జేసీబీ ఎక్కి ఆందోళన చేస్తున్న వెంకటేశ్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణం కూల్చివేత ఉద్రిక్తతకు దారితీసింది. ఆక్రమణదారు క్రిమిసంహారమందు డబ్బాతో రెవెన్యూ అధికారులను అడ్డుకొని, ఆందోళన చేపట్టాడు. వివరాల్లోకి వెళ్తే.. నగునూరులోని సర్వే నంబర్ 471 పోచమ్మకుంట గుట్ట ప్రాంత ప్రభుత్వ స్థలంలో కొన్ని కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇటీవల వేముండ్ల వెంకటేశ్ ప్రహరీ నిర్మాణం చేపడుతుండగా పంచాయతీ కార్యదర్శి మల్లయ్య పనులు నిలిపివేయించాడు. అయినా, ప్రహరీ నిర్మించాడన్న సమాచారంతో ఆర్ఐ రజనీకాంత్ సోమవారం మోకాపై వెళ్లి, పరిశీలించారు. అక్రమంగా నిర్మించిన ప్రహరీని జేసీబీతో కూల్చివేయించేందుకు ప్రయత్నించగా వెంకటేశ్ క్రిమిసంహార మందు డబ్బాతో వచ్చి, అడ్డుకున్నాడు. మిగతా వారి ఇళ్లను కూల్చివేసిన తర్వాతే తన గోడను కూల్చాలన్నాడు. లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించాడు. కూల్చివేతకు వచ్చిన జేసీబీ పైకి ఎక్కి, ఆందోళన చేపట్టాడు. స్వచ్ఛందంగా ప్రహరీని తొలగించుకోవాలని, లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆర్ఐ హెచ్చరించి, వెనుదిరిగారు. అయితే, ఈ స్థలంలో స్థానిక ప్రజాప్రతినిధుల అండతోనే పలువురు అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారని గ్రామస్తులు ఆరోపించారు. వాటిని తొలగించి, పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరారు.

ఆమె కళ్లు సజీవం



స్వరూప (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంకు చెందిన ముక్క స్వరూప(60) సోమవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతిచెందింది. కుటుంబసభ్యులకు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అవగాహన కల్పించడంతో ఆమె కళ్లను దానం చేయడానికి ముందుకువచ్చారు. దీంతో సంస్థ జిల్లా అధ్యక్షుడు నరహరి ఆధ్వర్యంలో టెక్నీషియన్ లక్ష్మణ్ సహకారంతో స్వరూప నేత్రాలను సేకరించి, హైదరాబాద్‌లోని ఐ బ్యాంక్‌కు పంపించారు. ఆమె భర్త కృష్ణమూర్తి, కుమారుడు-కోడలు శ్రావణ్‌కుమార్-శిరీషలకు ఫౌండేషన్ నిర్వాహకులు అభినందించారు. సంస్థ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్



సాంబశివరావు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సాంబశివరావును సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-1 ఇన్‌చార్జి ఐజీ సుధీర్‌బాబు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల సాంబశివరావుపై అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఎస్పీ అఖిల్ మహాజన్ దర్యాప్తు చేసి నివేదికను అందజేశారు. అవినీతి ఆరోపణలు నిజమని తేలడంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

మెట్‌పల్లి(కోరుట్ల): ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బాలిక ఏడాది క్రితం హైదరాబాద్‌లో ఉండగా నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలంలోని బచ్చన్‌పల్లికి చెందిన పృథ్వీ రాజ్‌తో పరిచయం ఏర్పడింది. తర్వాత ప్రేమిస్తున్నానని చెప్పి, పెళ్లి చేసుకుందామని అతను అడగగా.. అంగీకరించలేదు. ఆమె తల్లి వద్దకు వెళ్లి విషయం చెప్పగా.. ఒప్పుకోలేదు. దీంతో బాలికను బలవంతంగా బచ్చన్‌పల్లిలోని తన ఇంటికి తీసుకెళ్లి, లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఓ ఆలయంలో పెళ్లి చేసుకొని, తీవ్రంగా వేధించాడు. దీంతో ఆమె పారిపోయి తల్లి వద్దకు వచ్చింది. అయినా, తరచూ ఫోన్ చేస్తూ బెదిరింపులకు గురిచేస్తుండటంతో గత మే 31న పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. అప్పటినుంచి పరారీలో ఉన్న పృథ్వీరాజ్‌ను సోమవారం ఇబ్రహీంపట్నంలో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

కొత్త చట్టాలు.. తొలిరోజు ఐదు కేసులు

- జగిత్యాల, సిరిసిల్లలో రెండు చొప్పున..
- కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో ఒకటి నమోదు

జగిత్యాల క్రైం: కేంద్రం ప్రభుత్వం న్యాయశాఖలో కొత్తగా తీసుకొచ్చిన చట్టాల్లో భాగంగా తొలిరోజు జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉదయం 11 గంటలకు రెండు కేసులు నమోదయ్యాయి. చెర్లపల్లికి చెందిన ఆది గంగారెడ్డి తన వ్యవసాయ భూమిలోకి నీరు వదలిపెట్టాలని దీటి లావణ్యపై ఫిర్యాదు చేశాడు. దీనిపై తొలి కేసు నమోదైంది. అలాగే, దీటి గంగారెడ్డి తనను అసభ్యపదజాలంతో దూషిస్తూ, బెదిరించాడని దీటి లావణ్య ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై..

కరీంనగర్ క్రైం: మానకొండూర్ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కొత్తగా అమలులోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టూ టౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. మానేరు వాగు నుంచి ట్రాక్టర్‌లో కరీంనగర్‌లోని ముకరంపురకు ఇసుక తరలిస్తుండగా తెలంగాణ చౌక్ వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న ఒకరిపై..

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని రాళ్లపేటకు చెందిన సోమ లక్ష్మి ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన గజాది దేవేందర్‌పై గతంలో కేసు నమోదైంది. రిమాండ్ అనంతరం ఇంటికి వచ్చిన అతను లక్ష్మిని బెదిరిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సోమవారం భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తండ్రిపై తనయుడి దాడి..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): భారత న్యాయ సంహితలో భాగంగా ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో తొలి కేసు నమోదైంది. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పదిరకు చెందిన సూరం నర్సయ్య కూలి పనులు చేస్తూ జీవిస్తుండగా, అతని కొడుకు శ్రీనివాస్ జులాయిగా తిరుగుతున్నాడు. సోమవారం పనికి వెళ్లొచ్చిన తండ్రిని కొడుకు డబ్బులు ఇవ్వాలంటూ బెదిరించాడు. ఇవ్వకపోవడంతో కోపోద్రిక్తుడైన శ్రీనివాస్ తన తండ్రిపై కర్రతో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కొత్త చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

- ఎస్సారెస్పీలోకి 0.2 టీఎంసీల వరద నీరు



ఎస్సారెస్పీలోకి వస్తున్న వరద

జగిత్యాల అగ్రికల్చర్: మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లను తెలంగాణ, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం ఎత్తివేశారు. వాటిని జూలై 1 నుంచి అక్టోబర్ 28 వరకు నాలుగు నెలలపాటు తెరిచే ఉంచనున్నారు. దీంతో, బాబ్లీ ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో కురిసే వరద నీరు ఆగకుండా నేరుగా ఎస్సారెస్పీలోకి రానుంది. దీనివల్ల ఎస్సారెస్పీ నీటి మట్టం పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం బాబ్లీ నుంచి 0.2 టీఎంసీల వరద నీరు వస్తోంది. ఎస్సారెస్పీ నీటి మట్టం 10.474 టీఎంసీలుగా ఉంది. కార్యక్రమంలో పోచంపాడు ఎస్సారెస్పీ అధికారులు శ్రీనివాస్ గుప్తా, చక్రపాణి, వంశీ, మహారాష్ట్ర అధికారి బన్సోడ్, సమన్వయకర్తలు వెంకటేశ్వర్లు, సతీశ్ పాల్గొన్నారు.

'అల్ఫోర్స్'లో డాక్టర్స్, చార్టర్డ్ అకౌంటెంట్స్ డే



చైర్మన్ నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న వైద్యులు, సీఏలు

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో నేషనల్ డాక్టర్స్ డే, చార్టర్డ్ అకౌంటెంట్స్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మనుషుల ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు, ఆర్థిక వ్యవస్థను కాపాడటంలో సీఏలలు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. కోవిడ్-19 సమయంలో వైద్యుల సేవలు అనిర్వచనీయమని కొనియాడారు. పేదలకు వైద్యసేవలందిస్తూ సేవాభావం చాటాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పారమిత'లో వైద్యుల దినోత్సవం..

పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల, మంకమ్మతోటలోని పారమిత లిటిల్ జీనియస్ పాఠశాలలో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు పలువురు వైద్యులను సన్మానించారు. డాక్టర్లు దేవుళ్లతో సమానమని, వారి సేవలు అమూల్యమైనవని కొనియాడారు. వైద్య శిబిరం నిర్వహించి, విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. పాఠశాలల డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్ రావు, హన్మంతరావు, రమణ, ప్రసాద్, వినోద్ రావు, ప్రిన్సిపాల్ కవిత ప్రసాద్, గోపీకృష్ణ, నాగరాజు, రాము, సమత, నాజిష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జ్ఞాపిక అందిస్తున్న చైర్మన్ ప్రసాదరావు

ఆర్టీసీ ఉద్యోగి ఇంట్లో డీఎం విందు?

- సోషల్ మీడియాలో వైరల్



వైరల్ అవుతున్న ఫొటో

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీకృష్ణ సంస్థకు చెందిన ఓ ఉద్యోగి ఇంట్లో విందు చేసుకున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో మద్యం తాగడం వ్యక్తిగతమైన విషయమైనప్పటికీ ఉద్యోగుల ఇళ్లలో ఇలా చేయడం ఇబ్బందికరమని పలువురు పోస్టులు పెడుతున్నారు. దీనిపై డీఎంను వివరణ కోరగా గతేడాది జూలైలో ఉద్యోగి ఇంటికి తీజ్ ఉత్సవాలకు వెళ్లానని, ఎలాంటి మద్యం తీసుకోలేదని తెలిపారు. 10 నిమిషాలు మాత్రమే ఉండి వచ్చానని, ఎవరో కావాలనే ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

చొప్పదండిలో తాళం వేసిన ఇంట్లో చోరీ

- 14 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష అపహరణ

చొప్పదండి: పట్టణంలోని తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై ఉపేంద్రచారి కథనం ప్రకారం.. చొప్పదండి వివేకానంద చౌరస్తా సమీపంలో ఉండే గుర్రం చంద్రకళ భర్త 16 ఏళ్ల క్రితం మృతిచెందాడు. ఇద్దరు కుమారులు అమెరికాలో ఉంటున్నారు. ఈ క్రమంలో ఆమె గత నెల 26న శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుపతి వెళ్లింది. స్వామివారి దర్శనం అనంతరం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం ఆకెనపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లింది. 30న మధ్యాహ్నం తన ఇంటి పక్కనున్న బంధువు వరలక్ష్మిని ఒకసారి ఇంటికి వెళ్లి, చూడాలని కోరింది. ఆమె వెళ్లి పరిశీలించగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. విషయాన్ని చంద్రకళకు చెప్పడంతో సోమవారం ఇంటికి వచ్చింది. లోపలికి వెళ్లి చూడగా రెండు బీరువాలు ధ్వంసమై, సామగ్రి చిందరవందరగా పడి ఉంది. 14 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష, రెండు ఐప్యాడ్ చోరీకి గురైనట్లు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రంగపేట హైస్కూల్లో దొంగతనం



పాఠశాలలో పగులగొట్టిన కోడిగుడ్లు

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని రంగపేట ఉన్నత పాఠశాలలో దొంగలు పడ్డారని గ్రామస్తులు తెలిపారు. స్కూల్లో ఏర్పాటు చేసిన లైట్లు, మైక్ సెట్‌ను చోరీ చేశారన్నారు. వారి వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి దొంగలు పాఠశాలలోకి ప్రవేశించిన దొంగలు వరండాలో మద్యం సేవించారు. సీసాలను, స్కూల్ ఆవరణలో గల అంగన్‌వాడీ కేంద్రంలోని కోడిగుడ్లను పగులగొట్టారు. రూ.30 వేల విలువైన సోలార్ లైట్లు, స్కూల్ గది తలుపులు పగులగొట్టి, మైక్ సెట్‌ను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం పాఠశాలను శుభ్రం చేయడానికి వచ్చిన సిబ్బంది ఈ విషయమై గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు స్కూల్‌కు చేరుకొని, విచారణ చేపట్టారు. అధికారులు స్పందించి, పాఠశాల చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనారోగ్య కారణాలతో మహిళ బలవన్మరణం

చొప్పదండి: అనారోగ్య కారణాలతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ఉపేంద్రచారి కథనం ప్రకారం.. చొప్పదండి మండలంలోని రుక్మాపూర్‌కు చెందిన పెంటల రాజమ్మ(55) భర్త నుంచి విడిపోయింది. కూలీ పని చేసుకుంటూ జీవిస్తోంది. రెండేళ్ల క్రితం చొప్పదండిలోని పాత వెదురుగట్ట రోడ్డులో గల దుబ్బల మీద ఇందిరమ్మ కాలనీ వద్ద ఇల్లు నిర్మించుకుంది. ఆమెకు ఒక కూతురు కాగా, వివాహం జరిపించింది. ఈ క్రమంలో రాజమ్మ 2 నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఆమె కూతురు పలు ఆస్పత్రులకు తీసుకెళ్లి, చికిత్స చేయించినా నయం కాలేదు. గత 30న తల్లిని ఇంట్లో దింపి, వెళ్లిపోయింది. సోమవారం ఉదయం రాజమ్మ కనిపించకపోవడంతో స్థానికులు ఆమె కూతురుకు సమాచారం అందించారు. సమీపంలో వెతకగా, వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. మృతురాలి కూతురు న్యాతరి వనజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కరీంపేటలో యువకుడు..



సాయిరాం (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కరీంపేటకు చెందిన గుర్రం సాయిరాం (22) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మారెడ్డి, గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. గుర్రం నాగరాజు-భాగ్యలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. చిన్న కొడుకు సాయిరాం స్నేహితులతో కలిసి లఘుచిత్రాల్లో నటించేవాడు. కొంతకాలంగా కరీంనగర్‌లోని వైన్స్‌లో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. కొన్ని రోజుల క్రితం ఓ మహిళతో సహజీవనం చేసినట్లు తెలిసింది. ఆదివారం రాత్రి వరకు వైన్స్‌లో పనిచేసిన అతను సోమవారం తెల్లవారు జామున కరీంపేటలోని ఇంటికి వచ్చి, క్రిమిసంహారక మందు తాగి, మృతిచెందాడు. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీడీనగర్‌లో వృద్ధుడు..

పాలకుర్తి(రామగుండం): మండలంలోని జీడీనగర్‌కు చెందిన గోల్కొండ ఎల్లయ్య(77) ఆత్మహత్య చేసుకున్నాడు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి వివరాల ప్రకారం.. ఎల్లయ్య మద్యానికి బానిసయ్యాడు. సోమవారం మద్యం మత్తులో ఇంటికి వచ్చిన ఆయనను కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై, తాడు తీసుకొని, బయటకు వెళ్లిపోయాడు. గ్రామ శివారులోని పల్లె ప్రకృతి వనం సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. స్థానికులు గుర్తించి, సమాచారం ఇవ్వడంతో మృతుడి కుటుంబసభ్యులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎములాడ రాజన్నకు పోటెత్తిన భక్తులు

వేములవాడ: రాజన్నను సోమవారం భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈనెల 5 నుంచి అమావాస్య, ఆషాఢమాసం ఆరంభమవుతుండడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. భక్తుల ఏర్పాట్లను ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవోలు బి.శ్రీనివాస్, ప్రతాప నవీన్ పరిశీలించారు.



కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

- స్కూల్‌కు బైక్ తీసుకెళ్లనివ్వడం లేదని ఆత్మహత్యాయత్నం



మణిదీప్ (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని పోసానిపేటకు చెందిన మారు మణిదీప్(14) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మారు రాజ్‌కుమార్-లావణ్య దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కొడుకు మణిదీప్ కోరుట్లలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. స్కూల్‌కు బైక్ తీసుకెళ్తానంటే తల్లి అంగీకరించలేదు. దీంతో మనస్తాపానికి గురై, గత నెల 24న క్రిమిసంహారక మందు తాగాడు. ఈ విషయాన్ని 27న తల్లిదండ్రులకు చెప్పాడు. వారు మణిదీప్‌ను జగిత్యాల ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.